క్లుప్తంగా

ప్రశాంతంగా నీట్ పరీక్షలు



అభ్యర్థుల హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయం ఉన్నత పాఠశాలలో ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 240 మంది విద్యార్థులకు గాను 235 మంది పరీక్షకు హాజరుకాగా ఐదుగురు గైర్హాజరైనట్లు స్పెషల్ ఆఫీసర్, దెందులూరు తహశీల్దార్ సుమతి తెలిపారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో 114 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఆరుగురు గైర్హాజరయ్యారని స్పెషల్ ఆఫీసర్ పెదవేగి తహశీల్దార్ భ్రమరాంబ తెలిపారు.

రావులపర్రులో భగీరథ మహర్షి జయంతి



భగీరథుని విగ్రహానికి పూలమాల వేస్తున్న గాది వెంకటరమణ, గ్రామస్తులు

ఉంగుటూరు: భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఆదివారం రావులపర్రు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సగర్ల సంగం ఏలూరు జిల్లా యూత్ విభాగం ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ పార్టీ నాయకుడు గాది వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. భగీరథుని విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూల మాలలు వేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇబ్బా ముత్యాలరావు, దోనాద్రి నరసింహమూర్తి, గాది వెంకన్న బాబు, సగర సంఘం నాయకలు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో కాలువ రేవులు



కైకరం సుందర సీతారామస్వామి స్నాన ఘట్టంలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఉంగుటూరు: కాలువ రేవులు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. గోదావరి కాలువ ఏలూరు కాలువ వెంబడి ఉన్న గ్రామాల్లోని కాలువ రేవులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు ఆరేవులోకి వెళ్లడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఆ రేవులు ఎంతో శుభ్రంగా ఉండడంతో ప్రజలు వినియోగించుకునేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు కనుమరుగై చెత్తాచెదారం పేరుకుపోయి రేవులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి.

ధాన్యం కొనుగోలు చేయకుంటే ఎలా?



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు విష్ణు

దెందులూరు: ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తికావడంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనటం లేదని చెబుతుండడంపై రైతు, సానిగూడెం గ్రామ సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆదివారం ఆయన విలేకరులకు చూపించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల నుంచి ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయించారని, కానీ కూటమి ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు అకాల వర్షాల తమ పాలిట శాపంగా మారితే, మరోపక్క కూటమి ప్రభుత్వం టార్గెట్ పేరిట రైతులకు నరకం చూపిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతులు పండించిన పంటను వెంటనే కొనుగోలు చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు, గ్రామ సర్పంచ్ విష్ణు కోరారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

ఉంగుటూరు: నారాయణపురంలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దంపతులు పీటలు మీద కూర్చుని పూజలు చేశారు. వేద పండితులు పెద్దింటి అనిల్‌కుమారాచార్యులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అంతటా అతలాకుతలం

- పల్లపు ప్రాంతాలు జలమయం
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం



భీమడోలు: జంక్షన్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం



నిడమర్రు: నీట మునిగిన ఏలూరు- నిడమర్రు ఆర్‌అండ్‌బీ రహదారి

నిడమర్రు: అకాల వర్షంతో నిడమర్రు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం వేకువజాము 4 గంటల నుంచి ప్రారంభమైన వర్షం జల్లులు ఉదయం 7 గంటలకు గాలులతో కూడిన భారీ వర్షంగా మారింది. మధ్యాహ్నం 11 గంటల వరకూ వర్షం కొనసాగుతునే ఉంది. దీంతో ఏలూరు- గణపవరం రాష్ట్రీయ రహదారి బువ్వనపల్లి, మందలపర్రు, నిడమర్రు గ్రామాల్లో డ్రెయిన్లు ముంపునీటితో ఉప్పొంగటంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. బువ్వనపల్లి, అడవికొలను, పెదనిడ్రకొలను గ్రామాల్లో పట్టుబడి పూర్తయిన ధాన్యంను శనివారం రాత్రి బరకాలు కప్పి జాగ్రత్త చేసుకున్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి జాగ్రత్త చేసుకున్న ధాన్యం అడుభాగాలు నీటిలో తడిసినట్లు రైతులు చెబుతున్నారు. గత నాలుగు రోజులుగా మండలంలో గోనె సంచుల కొరతతో ధాన్యం అమ్మకాలు సాగలేదని ఈ అకాల వర్షంతో నిండా మునిగినట్లు అడవికొలను, బువ్వనపల్లి, ఎనికేపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి 41.4 మి.మీ. వర్షపాతం నిడమర్రు మండలంలో నమోదైనట్లు తహసీల్దార్ ఎస్ నాగరాజు తెలిపారు.

భీమడోలులో కుండపోత వర్షం

భీమడోలు: ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో ఆదివారం మండలమంతా అతలాకుతలమైంది. ఈదురు గాలులకు వృక్షాలు, చెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. హైస్కూల్లోని ప్రాంగణాలంతా వర్షపు నీటితో నిండిపోయాయి. పల్లపు ఏరియాల్లో రోడ్లు జలమయ్యాయి. భీమడోలులో ఎడతెరుపు లేని వర్షం కురవడంతో ఉన్నత పాఠశాలలోని ఆట స్థలం నీటితో నిండింది. గుండుగొలనులో వృక్షాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. పడిపోయిన చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు. రాత్రికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



పెదవేగి: ఈదురు గాలులకు చెట్లు ఊగుతున్న దృశ్యం



భీమడోలు: గుండుగొలనులో మెయిన్ రోడ్డుపై పడిన చెట్టు



నిడమర్రు: నీట మునిగిన బువ్వనపల్లి ఇందిరమ్మ కాలనీ

పెదవేగి: పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల ప్రభావంతో ఉక్కిరిబిక్కిరవుతున్న మండలంలోని ప్రజలకు తుపాను ప్రభావంతో ఆదివారం కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. ఆదివారం ఒక్కసారిగా ఈదురు గాలులు, మెరుపులతో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. కాగా ధాన్యం కళ్లాల్లో ఆరబెట్టుకున్న రైతులు ఆకాశంలో కారు మబ్బులు, పడుతున్న చినుకులు చూసి బెంబేలెత్తిపోతున్నారు. ధాన్యాన్ని టార్పాలిన్లు కప్పుకుంటూ నానా తంటాలు పడుతున్నారు.

ఎడతెరిపి లేని వర్షం

దెందులూరు: మండలంలో ఆదివారం ఈదురుగాలులతో ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఉదయం 9:20 నుంచి 12.45 గంటల వరకు కురిసిన జోరు వర్షం, ఈదురుగాలులకు పలు గ్రామాల్లో చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్లు పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం ఆగిన తరువాత విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు గ్రామాల్లో విద్యుత్ తీగలపై పడిన కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జాతీయ రహదారిపై ఆశ్రం, సోమవరప్పాడు మధ్య ప్రమాద సూచిక బోర్డు నేలకొరిగింది. వర్షానికి వెంకటాపురం పంచాయతీలో విద్యుత్ తీగలు స్తంభాలు నేలకొరిగాయి. మధ్యాహ్నం నుంచి ఏలూరు రూరల్ మండలం విద్యుత్ శాఖ ఏఈ నరసయ్య ఆధ్వర్యంలో లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్లు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఉంగుటూరు: మండలంలో ఆదివారం ఈదురు గాలులుతో కూడిన వర్షం కురవడంతో రైతులు పొలాలకు పరుగులు తీశారు. ఆరబెట్టిన ధాన్యం, రాశుల మీద ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా పాట్లు పడ్డారు. బొమ్మిడి, కై కరం, ఉప్పాకపాడు, కాకర్లమూడి, దొంతవరం, కాగుపాడు తల్లాపురం తదితర ప్రాంతాల్లో రైతులు బరకాలు, టార్పాలిన్లతో ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఇప్పటికే టార్గెట్లు అయిపోయాయని అనుమతులు ఇవ్వకుండా ఉన్నా లోడు లారీలు అలాగే ఉండిపోవడంతో రైతులు నష్టపోవాల్సి పరిస్థితి ఏర్పడింది.



దెందులూరు: జాతీయ రహదారిపై పడిపోయిన పోల్

అన్నదాతల గుండెల్లో గుబులు



గణపవరంలో కోతకు సిద్ధంగా ఉన్న దాళ్వాపైరు



వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ బరకాలు కప్పిన ధాన్యం

- చివరి దశలో దాళ్వా మాసూళ్లు
- రైతులను కలవరపెడుతున్న వాతావరణం

గణపవరం: దాళ్వా పంట చేతికొచ్చింది. వరికోతలు చివరి దశలో ఉన్నాయి. మరో వారం రోజుల్లో దాళ్వా మాసూళ్లు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో వాతావరణం రైతుల గుండెల్లో గుబులు రేపుతుంది. ఆదివారం తెల్లవారు జామున గణపవరం, నిడమర్రు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీనితో పలుచోట్ల ధాన్యం రాశులు, బస్తాల నెట్టులు తడిసిపోయాయి. రాశులపై కప్పిన ప్లాస్టిక్ బరకాలు ఈదురు గాలులకు ఎగిరిపోవడంతో పలు చోట్ల రాశులలో ధాన్యం తడిసిపోయింది. నెట్టు వేసిన ధాన్యం బస్తాలుకూడా కొంతమేర తడిసిపోవడంతో రైతులు బస్తాలు విప్పి ధాన్యం ఎండబెట్టుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

75 శాతం మాసూళ్లు పూర్తి

రెండు వారాలుగా వాతావరణం పూర్తిగా అనుకూలంగా ఉండటంతో రైతులు ఎంతో ఉత్సాహంగా రబీ కోతలు ప్రారంభించి, దాదాపు 75 శాతం మాసూళ్లు పూర్తిచేసి ధాన్యం ఒబ్బిడి చేసుకున్నారు. 50 శాతం రైతులు తమ ధాన్యం అమ్ముకోగా, మిగిలిన రైతులు సమీప రోడ్లు, పుంతగట్లు, ఖాళీ దిబ్బలకు తరలించి ఎండ బెట్టుకుని రాశులు, ధాన్యం బస్తాల నెట్లు కట్టి ఒబ్బిడి చేసుకున్నారు. అయితే రెండు మూడు రోజులుగా కోసిన పంట మాత్రం ఆదివారం కురిసిన భారీ వర్షానికి చాలావరకూ తడిసిపోయింది. ఉంగుటూరు నియోజకవర్గంలో 26 వేల హెక్టార్ల విస్తీర్ణంలో దాళ్వాసాగు చేయగా భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో నూరుశాతం మాసూళ్లు పూర్తయ్యాయి. గణపవరం మండలంలో 11,700 ఎకరాల విస్తీర్ణంలో రబీసాగు జరుగగా 9వేల ఎకరాలలో మాసూళ్లు పూర్తి కాగా ఇంకా 2,700 ఎకరాల్లో రబీ కోతలు పూర్తికాలేదు. మండలంలోని కేశవరం, మొయ్యేరు, ముప్పర్తిపాడు, కొండేపాడు, కోమర్రు, పిప్పర, వెంకట రాజపురం తదితర గ్రామాలలో రబీ వరికోతలు కోయాల్సివుంది.

నిలిచిపోయిన కొనుగోళ్లు

నియోజకవర్గంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లక్ష్యం పూర్తయిందన్న కారణంగా కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు ధాన్యం అమ్మకాలు నిలిచిపోయాయి. గణపవరం మండలంలో ఇప్పటివరకూ 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల చేతికి రాగా 27 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించారు. మిగిలిన ధాన్యంతోపాటు మాసూలు చేయాల్సిన 2700 ఎకరాలలో ధాన్యం రైతులు అమ్ముకోవలసి ఉంది. ఈ పరిస్థితిలో వాతావరణ మార్పులు రైతుల కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. చీడపీడలు, తెగుళ్ల తదితర సమస్యలను అధిగమించి పంటను అందుకోవడానికి రైతులు ఎదురు చూస్తున్న తరుణంలో వాతావరణం వారిని బెంబేలెత్తిస్తుంది. కొల్లేరు ప్రాంతమైన నిడమర్రు మండలంలో కూడా మూడొంతుల విస్తీర్ణంలో రబీ మాసూళ్లు పూర్తయినట్లు చెబుతున్నారు. వరి కోతలు పూర్తిచేసిన రైతులు తమ ధాన్యం రోడ్లు, పుంతల్లో ఆరబెడుతూ తేమశాతం తగ్గించడానికి పాటుపడుతున్నారు. పూర్తి ఆరుదల ధాన్యం ఎకరాకు 50 నుంచి 55 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.30 వేల వరకు అయ్యింది. అయినా దిగుబడి బాగుందనుకుంటే రోజూ వాతావరణంలో మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. పది రోజులపాటు వాతావరణం అనుకూలిస్తే గట్టెక్కుతామని రైతులు దేవునిపై భారం వేస్తున్నారు.

బాలసాహిత్యంతో విద్యార్థుల్లో వికాసం, విజ్ఞానం

భీమడోలు: బాల సాహిత్యంతో విద్యార్థుల్లో వికాసం, విజ్ఞానం పెంపొందుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. ఆదివారం భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగాయి. భీమడోలు శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా మండే సుధాకర్ పాల్గొని చిన్నారులకు నీతి కథలు వివరించారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ మానవ అవయవాలు, వాటి బరువులపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండే సుధాకర్ ఛలోక్తులు విసిరి చిన్నారులను నవ్వించారు. అనంతరం చదరంగం, కేరమ్స్, అంత్యాక్షరీ తదితర ఆటలు ఆడారు. ఈ కార్యక్రమాల్లో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



భీమడోలులో చిన్నారులకు నీతి కథలు చెబుతున్న మండే సుధాకర్

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

ఉంగుటూరు: ఆరుగాల కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ వింగ్ కమిటీ కార్యదర్శి, ఏలూరు జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు యెలిశెట్టి పాపారావు బాబ్జి అన్నారు. ఆదివారం కురిసిన అకాల వర్షంతో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆయన మాట్లాడారు. టార్గెట్లు సకాలంలో ఇవ్వకపోవడంతో ఉంగుటూరు మండలంలో 20 వేల మెట్రిక్ టన్నులు తడిసిపోయిందన్నారు. అమరావతి పున: నిర్మాణ సందర్భంగా ప్రధాని మోదీ భజనలో మునిగిన కూటమి ప్రభుత్వం, రైతులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. రైతులు సుమారు పది రోజుల నుంచి ధాన్యం సంచుల్లో పట్టి నెట్లు వేసుకుని లారీల కోసం ఎదురు చూస్తూంటే టార్గెట్లు అయిపోయాయని, మీరు బహిరంగ మార్కెట్లులో అమ్ముకోండి అని అధికారులు చెబుతుండడం దారుణమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తే కూటమి ప్రభుత్వం టార్గెట్ల పేరుతో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. తక్షణమే ధాన్యం మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని, లేకుంటే రైతులకు మద్దతు నిరసనలు చేపడతామని హెచ్చరించారు.



తడిసిన ధాన్యం బస్తాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం. పెదవేగి మండలం చక్రాయిగూడెంకు చెందిన యాండ్ర రామకృష్ణ, దొంగల రాజీవ్‌ర్ నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో జరుగుతున్న జాతర కార్యక్రమానికి బైక్‌పై వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఏలూరు నుంచి కొవ్వూరు వైపునకు వెళుతున్న ఇన్నోవా కారు వీరి బైక్‌ని వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో రోడ్డుపై పడిపోవడంతో రామకృష్ణ, రాజీవ్‌ర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో విజయవాడ నుంచి కాకినాడకు కారులో వెళుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఘటనా స్థలం వద్ద ఆగి, క్షతగాత్రులను పరిశీలించారు. అనంతరం వారిని 108 అంబులెన్స్‌లో ఎక్కించి, తన కాన్వాయ్‌లోని కారును ఎస్కార్ట్‌గా ఇచ్చి, ఏలూరు ప్రభుత్వాస్పత్రికి పంపించారు. మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఎస్పీకి ఫోన్ చేసి చెప్పారు.

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బాలకృష్ణ

ఉంగుటూరు: ఉంగుటూరు ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. దీంతో ఈ పదవికి సిఫారసు చేసిన మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును ఆదివారం బాలకృష్ణ కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు.



పుప్పాల వాసుబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న బాలకృష్ణ

విద్యుత్ వైర్లు తగిలి ఎండు గడ్డి దగ్ధం

ద్వారకాతిరుమల: ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఎండు గడ్డికి విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన ద్వారకాతిరుమల మండలంలోని సత్తాల పంచాయతీ, సంద్రకుంట గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. ఉంగుటూరు మండలం కొండ్రుపాడు నుంచి ట్రాక్టర్‌లో ఎండుగడ్డి సత్తాల వైపునకు వెళుతోంది. సంద్రకుంట శివారులోకి వచ్చేసరికి గడ్డిలోంచి పొగలు రావడాన్ని డ్రైవర్ గుర్తించాడు. వెంటనే ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన నిలిపివేసి, మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. అయితే గడ్డి పూర్తిగా దగ్ధమైంది. గడ్డికి పైన విద్యుత్ తీగలు తగలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు చేసే నాథుడు లేక..

భీమడోలు: ధాన్యం కొనుగోలు చేసే నాథుడు లేక రైతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతు సేవా కేంద్రాలకు ఇచ్చిన ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి కావడంతో మిగిలిన ధాన్యమంతా రోడ్లు, డివైడర్ల వద్ద ఆరబోసుకుంటున్నారు. సేకరణ లక్ష్యం పెంచితేనే ధాన్యం కొనుగోలు చేస్తామని రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఖరాఖండిగా చెప్పడంతో చేసేది లేక నిస్సహాయంగా ఎదురుచూస్తున్నారు. కాగా భూయాజమానులు తమ పంటకు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించకపోవడంతో కౌలు రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదు. దీంతో వారంతా దళారుల వద్ద అయినకాడకు అమ్మేందుకు సిద్ధంగా ఉన్నారు.

రైతుల పాలిట వరుణిడి శాపం

కౌలు రైతుల పాలిట వరుణుడు శాపంగా మారాడు. ఆదివారం ఏకధాటిగా వర్షం కురవడంతో ధాన్యం తడిసిపోయింది. భీమడోలు మండలంలో 12,735 ఎకరాల్లో 63వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా కేవలం 43,254 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. ఇంకా రైతుల వద్ద 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది. ఈ తరుణంలో భారీ వర్షంతో రైతులు కుదేలయ్యారు. వర్షాలు పడుతుండడంతో ఇప్పుడు ధాన్యం కొంటామని అధికారులు అంటున్నారు. ముందుగా ధాన్యం కొంటే మాకు ఈ పరిస్థితి రాదు కాదా అని రైతులు ప్రభుత్వం, అధికారుల వైఖరిపై దుమ్మెత్తి పోస్తున్నారు.



ఈ క్రాప్, ఈకేవైసీ చేయకపోవడంతో రోడ్డుపై ఉన్న ధాన్యం తడిసిన దృశ్యం

దళారులకు అమ్ముకోవాల్సిందే

ఓ రైతు వద్ద 1.75 ఏకరాల భూమిని కౌలుకు తీసుకుని రబీ సాగు చేశాను. ఎకరాకు 55 బస్తాలు చొప్పున 100 బస్తాలు దిగుబడి వచ్చింది. రైతు సేవా కేంద్రానికి వెళ్లి ధాన్యం కొనుగోలు చేయమని అడిగితే ఈ సర్వే నెంబర్‌లోని పంటకు ఈ క్రాఫ్, ఈకేవైసీ చేయకపోవడంతో ధాన్యం కొనుగోలు వీలుపడదని చెప్పారు. ఇప్పుడు ఏం చేయాలో తెలియని పరిస్థితి. దళారులకు అమ్మితే రూ.5వేల వరకు నష్టం వస్తుంది. ఈతరుణంలో వర్షం వల్ల ధాన్యం బస్తాలు అడుగు భాగమంతా తడిసిపోయింది.

– భోగాపురం వెంకటరమణ, కౌలు రైతు, భీమడోలు